జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ కరీంనగర్ II
సోమవారం 27 మే 2024 www.ntnews.com

**'న రావణం సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్**
**శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః'**


**'వేయిమంది రావణులైనా యుద్ధంలో నాముందు నిలువలేరు. శిలలతో, వృక్షాలతో సకల రాక్షసులను, లంకాపురినీ ధ్వంసం చేస్తాను' ఇదీ హనుమ జయధ్వానం. లంకాపురిలో సీతమ్మ జాడ తెలుసుకున్న తర్వాత ప్రాసాదం అధిరోహించి ఆంజనేయుడు పలికిన హెచ్చరిక. చూసి రమ్మంటే కాల్చి వచ్చిన ఆయనకు.. అక్కడికక్కడ రావణుణ్ని కొట్టడం పెద్ద లెక్కకాదు! రావణ సంహారం తన స్వామి కార్యమని తలచాడు.**

## నవ అవతార మూర్తి

**దుష్టశిక్షణ** కోసం నారాయణుడు రాముడిగా అవతరించాడు. రామచంద్రుని అవతార ప్రయోజనాన్ని సిద్ధింపజేసే సంకల్పంతో రుద్రుడు.. ఆంజనేయుడిగా ఏతెంచాడు. వైశాఖ మాసం కృష్ణ పక్ష దశమి నాడు ఆంజనేయుడు జన్మించాడని పరాశర సంహిత చెబుతున్నది. శివుడి అష్టమూర్తుల్లో ఒకటైన వాయుదేవుడి అనుగ్రహం ద్వారా కేసరి అనే వానర వీరుని భార్య అంజనాదేవికి తపః ఫలితంగా రుద్రతేజంతో హనుమ జన్మించాడు. కిష్కింధకాండ మొదలుకొని యుద్ధకాండ ముగిసే వరకు రామకార్యంలో కృతకృత్యుడు అయ్యాడు హనుమ. సీతమ్మ ఎడబాటుకు గురైన రాముడిని ఊరడించాడు. సముద్రాన్ని అవలీలగా లంఘించాడు. సీతమ్మ జాడ కనిపెట్టాడు. వివిధ సందర్భాల్లో హనుమ మొత్తం తొమ్మిది అవతారాలు ధరించారు. ఇవే హనుమన్నవావతారాలుగా ప్రసిద్ధి పొందాయి. పరాశర సంహితలో ఇందుకు సంబంధించిన విషయాలన్నీ విస్తారంగా ఉన్నాయి. ఈ తొమ్మిదిటిలో ప్రసన్నాంజనేయుడి అవతారం ఒకటి. మహాభారతంలో అర్జునుడి జైత్రయాత్రకు జెండాపై కపిరాజుగా సహకరించిన రూపమే ప్రసన్నాంజనేయుడు. కాగా, గంగానదిలో మునిగిపోయే ప్రమాదంలో చిక్కుకున్న మైందుడనే బ్రాహ్మణుడిని కాపాడటానికి మారుతి ఎత్తిన అవతారమే వీరాంజనేయుడు. రామ ముద్రిక కోసం సాక్షాత్తూ బ్రహ్మదేవుడితో వివాదపడిన హనుమ... బ్రహ్మలోకాన్ని పెళ్లగించేస్తానని 20 చేతులలో 20 ఆయుధాలు ధరించి 'వింశతి భుజాంజనేయ' అవతారంలో విశ్వరూపం చూపించాడు. శతకంఠ రావణుడి సంహారం కోసం సీతమ్మవారికి అండగా పోరాడుతూ ఆంజనేయుడు 'పంచముఖ' అవతారం దాల్చాడు. దుర్వాస మహాముని తపస్సుకు సంతుష్టుడై పద్దెనిమిది భుజాలతో ప్రత్యక్షమైన రూపం అష్టాదశ భుజ ఆంజనేయ అవతారం. ఇక కుండిన నగరంలో ధ్వజదత్తుడనే వేదవేదాంగవేత్తకు పేదరికాన్ని పోగొట్టిన రూపం 'సువర్చలాంజనేయ' అవతారం. కపిలుడనే పండితుడిని అనుగ్రహించడానికి 'చతుర్భుజ ఆంజనేయ' అవతారం ధరించాడు. ఈ అవతారంలో హనుమంతుడి పక్కన సువర్చలా దేవి ఉండటం ప్రత్యేకం. మరో అవతారం 'ద్వాత్రింశత్ భుజ ఆంజనేయుడు'. ఇందులో ముప్పై రెండు భుజాలతో మాహిష్మతి పాలకుడు సోమదత్తుడిని రక్షించాడు. ఇక గాలుడనే బోయను కరుణించడానికి 'వానరాకార ఆంజనేయ' అవతారాన్ని ధరించాడు.




# అనఘుని అఘమోక్షణ లీల




**'దూడల దండులో** దూరిన ఏకు వంటి లేత దంభం కల వత్సా(దూడ)సురుని వధించి శౌరి- కృష్ణుడు, మరోసారి ముని మానస బృందంలోనికి చొచ్చుకు వచ్చిన పెచ్చరిల్లిన- మేకు వలె ముదిరిన, దంభం కల బకాసురుని అసువు(ప్రాణా)లను హరించాడు.'- ఇది వ్యాఖ్యాతృ చక్రవర్తి శ్రీధరాచార్యుల శ్రీముఖం! 'ఏకు మేక యింది, మొక్కగా వంగనిది మానై వంగుతుందా?' అనే సామెతల ఆసాములే వత్సాసుర బకాసురులు.

శ్రీశుక ఉవాచ.. పరీక్షిన్మహారాజా! బలరామాది గోపబాలురందరూ చిన్నారి కన్నయ్యతో కూడి దూడల మందలను మళ్లించుకొంటూ తిన్న- తిన్నగా బృందావనంలోని తమ తమ వాడ(వీధు)లకు చేరుకున్నారు. అసురవధను గురించిన కథను వారి ద్వారా విని బృందావని వాసులు నివ్వెరపోయి ఇలా తలపోశారు...

**కం|| 'ఆపదల మీద నాపద**
**లీ పాపని జెంది తొలగె నీ యర్భకుపై**
**వేపడిన ఖలులు దహనుని**
**వైపున శలభముల పగిది బడిరి ధరిత్రిన్'**

ఈ బుడతనిపై కడు ఆపదలు వచ్చిపడుతూ వడి-వడిగానే విచ్చి- సమసి పోతున్నాయి. పసివాడే కదా అని వీని మీద కసితో విరుచుకుపడ్డ ఖలులు- దుష్టులందరూ మంటల్లో ఎగసి (గర్వించి) పడే మిడుతల వలె పస (సారం, సమృద్ధి) చెడి నశిస్తున్నారు.

శుకుడు- రాజా! ఒకనాడు రామకృష్ణులు తోడి బాలురతో కూడి వన భోజనాలు చేయాలని సరదాపడ్డారు. పొద్దునే లేచి చద్ది అన్నపు కావడులను, పిండివంటల మూటలను ఒద్దికగా భుజాలకు తగిలించుకొని సందడి చేస్తూ దూడలతో అడవిలో ప్రవేశించారు. కేరింతలు కొడుతూ, కుప్పించి దూకుతూ తమ నీడలను చూసి నవ్వుకుంటూ, పరుగెత్తుతూ, కలసిమెలసి పకపకలతో ఎకసెక్కెము (పరిహాసము)లాడుతూ పలు రకాల ఆటలు ఆడుకొంటున్నారు...

**కం|| 'వనజాక్షుడు మున్నరిగిన**
**మునుపడగా నతని నేనె ముట్టెద ననుచుం**
**జని మును ముట్టని వానిన్**
**మును ముట్టిన వాడు నవ్వు మొనసి నరేంద్రా!'**

మునీంద్రుడు పరీక్షిత్తుతో... 'నరేంద్రా! కరీంద్రుని గాచిన విష్ణుడు- కృష్ణుడు దూరంగా ముందు నడుస్తూ ఉంటే ఇద్దరు కొంటె పిల్లలు అతనిని 'ఎవరు ముందుగా ముట్టుకుంటారో' అంటూ వెంటపడ్డారు. నందుపట్టి- బాలకృష్ణుని ముందుగా ముట్టుకున్నవాడు పట్టలేని వాణ్ణి చూసి బెట్టుగా పకపకా నవ్వాడు'. వనశోభను దర్శిస్తూ భువన సుందరుడు నందనందనుడు కొద్దిగా ముందుకు వెళ్లినప్పుడల్లా వల్లవ కుమారులందరూ పోటీపడి మరీ పరిగెత్తుతూ వెళ్లి యదువల్లభుని తాకి-తాకి అలౌకికమైన ఆనందాన్ని పొందేవారట! సుఖేన బ్రహ్మ సంస్పర్శం అత్యంతం సుఖమశ్నుతే'- అన్న గీతావాక్యం అపురూపంగా రూపుదాల్చింది. 'ఒక్క పరమాత్మ విషయంలో తప్ప ఈ ప్రపంచంలో మరి దేని కొరకూ 'నేను-నేను' (అహం పూర్వం అహం పూర్వం) అంటూ మేనును- శరీరాన్ని మోసుకుంటూ ముందుకు తోసుకు రాకూడదు'- అని ఈ లీలా పరమార్థం.

**ఉ|| 'ఎన్నడు నైన యోగి విభులెవ్వని పాద పరాగ మింతయుం**
**గన్నుల గాన రట్టి హరి గౌగిట జేర్చుచు జెట్ట బట్టుచుం**
**దన్నుచు గ్రుద్దుచున్ నగుచు దద్దయు బై పడి కూడి యాడుచున్**
**మన్నన సేయు వల్లవ కుమారుల భాగ్యము లింత యొప్పునే!'**

శుకుడు... మహారాజా! మహామహా యోగులు కూడా ఏ పరమ పురుషుని పాద పద్మాల పరాగాన్ని- పవిత్ర ధూళిని ఏనాడూ కన్నులారా కొద్దిగా కూడా కనలేరో, అట్టి వనమాలా విరాజితుని, ఘన చక్ర హస్తుని, అనవద్యుని, లీలావినోది విష్ణుని- బాలకృష్ణునితో గోపబాలురు కలసిమెలసి అతణ్ణి కౌగిలించుకుంటూ, చెట్టపట్టాలు పట్టుకుంటూ, తన్నుతూ, మీదపడుతూ, వెన్ను మీద గుద్దుతూ, హద్దులెరుగని హర్షంతో హాస్యాలాడుతూ, హేరాళం- హెచ్చుగా ఆడుతూ ఎంతో చనవు- ముచ్చటతో మెలగుతున్నారు. కల్లలెరుగని ఆ వల్లవ (గొల్ల) కుమారుల ఎల్లలు లేని భాగ్యాలు ఎంతటివని చెప్పవచ్చు?

**కం|| 'విందులకును బ్రహ్మసుఖా**
**నందంబై భక్తగణమునకు దైవతమై**
**మందులకు బాలుడగు హరి**
**పొందుగనిరి గొల్లలిట్టి పుణ్యులు గలరే?'**

విందులకు- యోగులకు, జ్ఞానులకు నిర్వికల్పానంద- బ్రహ్మానంద స్వరూపుడు, భక్తులకు పరమ ఆరాధ్యదైవమూ అయిన ఆ గోవిందుడు, మందులకు- అజ్ఞానులకు సామాన్య బాలుని వలె కనిపిస్తున్నాడు. అట్టి అరవింద నేత్రుని, బాల ముకుందుని స్నేహాన్ని, సాన్నిధ్యాన్ని పొందినవారు ఈ గొపబాలురు! ఆహా! వారి ఇహపరాల అగణ్య (లెక్కలేని) పుణ్యాల నైపుణ్యాలు ఊహాతీతాలు కదా!

శుకుడు- రాజా! ఇదిలా ఉండగా కొలది కాలానికే అఘుడు అనే అసురుడు కంసుని పంపున శిఖిపింఛావతంసుని- నెమలి పింఛం తలపువ్వుగా కలవానిని, బకవైరిని, శౌరిని సఖులతో సహా సంహరిస్తానని అజగర (కొండచిలువ) రూపంతో పొదల మాటున నెమ్మదిగా కదలివచ్చాడు. అఘము అంటే పాపం. వీడి పేరే అఘుడు. మూర్తీభవించిన 'పాపం'! అనుభవించకుండా ఏది అంతరించదో అదీ 'అఘం'- పాపం. ఇతరుల సుఖం, సంతోషం, సంపద, సమున్నతి చూడలేనివాడు. వీడు అఘుడైతే గోపబాల సఖుడు, ఘన శ్యాముడు అనఘుడు- పాప రహితుడు. అంతే కాదు, 'అఘహృత్'- ఎంతో పాపహరుడు కూడా! ఈ అఘాసురుడు పూతనా, బకాసురుల అనుజుడు. అనగా అవిద్య (పూతన), దంభం (బకుడు)- ఈ రెండూ పాపానికి అక్క, అన్నలు. అవిద్యా దంభాలున్న చోటుకు పాపం తప్పక తిన్నగా- సూటిగా, దన్ను (అండ)గా, హెచ్చుగా చొచ్చుకు వస్తుందని హెచ్చరిక!

రామకృష్ణులు తమవారితో రోజువారీగా వచ్చి పోయే దారిలో ఆ మాయదారి రాకాసి చిలువ (పాము) కొండగుహ లాంటి తన నోరు నిండుగా తెరిచి పండుకొని ఉండిపోయింది. గోప బాలురు ఆ దారిన వస్తుండగా అది వారి కంటపడ్డది..

**మ|| 'బకునిం జంపిన కృష్ణుడుండ మనకుం బామంచు జింతింప నేటికి? రా పోదము దాటి, కాక యది కౌటిల్యంబుతో మ్రింగుడున్ బకు వెంటం జను గృష్ణుచేత' ననుచుం బద్మాక్షు వీక్షించి యుత్సుకులై చేతులు వ్రేసి కొంచు నగుచున్ దుర్వారులై పోవగన్...**

రాజా! దానిని ఒకరికొకరు చూపించుకున్నారు కాని, ఎవరూ భయపడలేదు. 'బకాసురుని చంపిన అభయ స్వరూపుడైన మేటి కృష్ణుని అండ ఉండగా ఈ కొండచిలువ వలన మనకు భయమేమిటి? రండు, దాటిపోదాం. అలకాక, కౌటిల్యం- కుచ్చితపు బుద్ధితో మోసగించి ఇది మనలను మ్రింగితే, బకాసురుని మాదిరి ఈ రాకాసి పాము కూడా కచ్చితంగా చచ్చిపోతుంది' అని అనుకుంటూ చలువ- చల్లని చూపుల కృష్ణునికేసి చూస్తూ గొల్లపిల్లలందరూ ఆగలేక తమ లేగలతో సహా దారుణమైన ఆ రాకాసి చిలువ నోటిలో దూరారు. వారిని వారించే వారెవరూ లేకపోయారు. వారికి ఎర్రగా, మెత్తగా ఉన్నదాని



నాలుక ఒక తివాసీవలె, పరుపులాగా సుఖప్రదంగా తోచింది. ఇదే జీవుణ్ణి సంసార మోహం లోనికి లాగివేసే భ్రమ! ఆపదను సంపదగా భావించే భ్రాంతి!

అప్పుడు పరమాత్మ... 'అయ్యో! ఈ అర్భకు (అమాయకు)లందరూ దీనిని రాకాసి కొండచిలువ అని గ్రహించక, నేనున్నాననే మొండిధైర్యంతో నిర్భయంగా దీని తుండం- ముఖంలో ప్రవేశించారు' అని తలచాడు. ఈ తావులో పోతన కష్టమైన సంయుక్తాక్షరాన్ని (ల్ప) ప్రాసగా గ్రహించి తనకిష్టమైన అంత్యానుప్రాస అలంకారంలో స్వకీయమైన ఈ విశిష్ట శార్దూల వృత్తాన్ని ఎంతో అందంగా విరచించాడు..

**శా|| 'వేల్పుల్ సూచి భయంబునొంద గ్రసనావేశంబుతో నుజ్జ్వలత్కల్పాంతోజ్జ్వలమాన జిహ్వదహనాకారంబుతో మ్రింగెన స్వల్పాహీంద్రము, మాధవార్పిత మనోవ్యాపార సంచారులన్ స్వల్పాకారుల శిక్యభారుల గుమారాభీరులన్ ధీరులన్'..**

అప్పుడు ఆ అసురుడు ఆ ఆభీర (గొల్ల) కుమారులందరినీ మింగివేసే ఆవేశంలో నోరు ఒక్కసారిగా అప్పళించాడు. ప్రళయకాల అగ్నిజ్వాలల వలె మండుతున్న తన నాలుకతో వారందరినీ మింగబోయాడు. ఇది చూచి దేవతలంతా కంగారుపడ్డారు. రాజా! గొల్లపిల్లల ఉల్లము(మనసు)లన్నీ ఎల్లప్పుడూ నల్లవాని చుట్టూనే అల్లుకు తిరుగుతూ ఉంటాయి.

వారు శారీరకంగా అంత శక్తిమంతులు కారు. ఎంత చిన్నవారంటే, తాము మోస్తున్న అన్నపు చిక్కాలు కూడా వారికి బరువే! అయితే వారంతా కృష్ణునికి అన్ని విధాల సమర్పితులు కాన, అంతగా ధైర్యవంతులుగా ఉన్నారు. ఆపద్బాంధవుడు కనుక దానవారి, మురారి ఆ పాప (సర్ప) రూపధారి అయిన అసురుని వంచనకు కినుక పూని- కోపగించి, తన పంచన- ఆశ్రయంలో ఉన్న వారి వెనుక తానూ వెళ్లాడు. ఆ దానవుని గొంతుకలో అడ్డంగా నిలిచి తన మేను- దేహాన్ని అడ్డదిడ్డంగా పెంచి తమ్మికంటి (పద్మాక్షుడు) కృష్ణుడు దిమ్మిస కొట్టి వాని నడ్డి విరిచాడు. ఊపిరి ఆడక ఆ పాపి ప్రాణాలు తల పగుల కొట్టుకొని- బ్రహ్మరంధ్రం చీల్చుకొని చాల పెద్ద శబ్దంతో బహిర్గతాలై అనంతవాయువులో కలిసిపోయాయి. సర్ప శరీరం నుంచి వెలికి వచ్చిన అద్భుతమైన వెలుగు- శుద్ధ సత్త్వమయ జ్యోతి, కందర్పదర్పహరుని దివ్యదేహంలో అర్పితమయింది!

(సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

గీతావాక్యం

## హృదయ దౌర్బల్యాన్ని వీడితేనే..

**క్లైబ్యం మా స్మ గమః పార్థ! నైతత్త్వయ్యుపపద్యతే।**
**క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప॥**
(భగవద్గీత 2-3)

'ఓ పార్థా! పిరికితనానికి స్థానమైన క్లైబ్యాన్ని విడిచిపెట్టు. నీలాంటి వీరుడికి, ప్రాజ్ఞునికి హృదయ దౌర్బల్యం తగదు. ఓ పరంతపా! సుస్థిరమూర్తివై యుద్ధరంగంలో నిలబడు' అని అర్జునుడికి ఉపదేశించాడు శ్రీకృష్ణపరమాత్మ.

కురుక్షేత్ర యుద్ధరంగంలో చావోరేవో తేల్చుకోవలసిన సమయంలో అర్జునుడు మోహంలో మునిగి, అడవులలో కందమూలాలు భుజిస్తూ జీవించేందుకు సన్నద్ధుడయ్యాడు. ఆదరణీయమైన క్షాత్రధర్మాన్ని విడిచిపెట్టి అస్త్రసన్యాసం చేశాడు. ప్రతివ్యక్తిలో సహజస్థితి అయిన చేతన వెలుగు చూసినప్పుడే ధర్మస్థాపన జరుగుతుంది. మోహంలో మునిగి కర్తవ్యాన్ని విస్మరించిన సమర్థుడైన వ్యక్తిని కార్యోన్ముఖుడిని చేయాలి. సమర్థత కలిగీ ఎదురైన సమస్య పట్ల ఉదాసీనంగా వ్యవహరించడమే క్లైబ్యత. నిర్లిప్తత, ఉదాసీనతల వల్ల స్తబ్ధత ఏర్పడుతుంది. కానీ, మనిషి చైతన్య శీలి. కాబట్టి అర్జునుడిలో ఏర్పడిన ఉదాసీనతతో కూడిన స్తబ్ధతను పారదోలాలి. అప్పుడే ధర్మస్థాపన జరుగుతుంది.

సంకల్పించిన కార్య నిర్వహణ జయప్రదంగా కొనసాగాలంటే నాయకుడిలో ఉత్సాహం, స్ఫూర్తి, పట్టుదల అవసరం. ఆశావహ దృక్పథంతో, సమర్థతతో ముందుకుసాగాలి. మధ్యలో ఎదురయ్యే ప్రతికూలతలను అధిగమిస్తూ... అనుచరులకు ప్రేరణను ఇస్తుండాలి. బద్ధకం, వాయిదా వేసే జబ్బు, దురలవాట్లు, అజ్ఞానం, మోహం లాంటి మనోకల్పిత భ్రాంతులకు దూరంగా సహచరులతో ఏకోన్ముఖుడై సాగితేనే విజయం సాధిస్తాడు. అనివార్యమైన యుద్ధంలో ఎదుటివారు బలవంతులైన సమయంలో దక్షత కలిగిన నాయకునిలో కావాల్సిన మూర్తిమత్వాన్ని, సాధకుడిలోని అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నాడు, సమర్థుడైన గురువు.

ఇక్కడ అర్జునుడిని పార్థా, పరంతపా అని సంబోధిస్తున్నాడు కృష్ణుడు. రెండు కూడా సాభిప్రాయాలే. పృథుడి కుమారుడు పార్థుడు. కుంతీదేవికి ఇంద్రుని అనుగ్రహంతో జన్మించినవాడు, అర్జునుడు. ఇంద్రుడు దేవతలకు రాజు. ఎన్నిమార్లు రాక్షసుల దౌర్జన్యాలకు గురైనా ఏదో ఒక ఉపాయంతో వారిని నిగ్రహించి ధర్మాన్ని స్థాపించాడు. తన హక్కుగా ఉన్న అమరావతిని సొంతం చేసుకున్నాడే కానీ.. ప్రయత్నాన్ని విడవలేదు. నిరాశా నిస్పృహలకు మనసులో చోటివ్వలేదు. 'అసామాన్య



శక్తిసామర్థ్యాలు కలిగిన ఇంద్రుని పుత్రుడవైన నీవు కూడా అసమాన్య ప్రతిభాపాటవాలను ప్రదర్శించాలే కానీ, పిరికివాడిలా, అధైర్యపరుడిగా నిర్వేదనతో పారిపోవడం సమంజసం కాద'ని హితవు పలికాడు.

పరంతపా! శత్రువులను తపింప చేసే వాడా అనడం వల్ల శత్రువులకు భయపడి, పౌరుష హీనుడివై వెనక్కి తగ్గడం పురుషత్వం కాదని హెచ్చరిస్తున్నాడు. ప్రతి వ్యక్తికీ విజయసాధన సహజ లక్షణం. ఆ సహజత్వంపై బంధుప్రీతి, ఆత్మన్యూనత లాంటి అసహజమైన ఎన్నో ముసుగులను కప్పడం వల్ల విజయానికి దూరమవుతున్నారు. 'అంతర్గత శత్రువులను తపింప చేసిన సాధన నీలో ఉంది' అని అర్జునుడి సామర్థ్యాన్ని గుర్తుచేస్తున్నాడు శ్రీకృష్ణుడు. 'నీ నిజ స్వరూపాన్ని గుర్తించి.. దానిని బహిర్గతం చేయమ'ని ప్రబోధిస్తున్నాడు.

ఆ సమయంలో అర్జునుడి మనసును కలచి వేస్తున్న భావనలు తనవారిపై కృపాకారుణ్యాలు, నైతికమైన సామాజిక బాధ్యత కాదు. నిజానికి అది చిత్తభ్రాంతితో కలిగిన శోకం మాత్రమే. దీనికి మూలం మానసిక బలహీనత. నియంత్రణ లేని మనసుపై ఇంద్రియాల విజయం వల్ల కలిగిన వైరాగ్యం దూరమైతే అతని వ్యక్తిత్వంలో పరిణతి కనిపించేది. అతనిలోని ధర్మాగ్రహం వెలుగు చూసేది. ఆ క్రమంలో తనకు అయోమయం, శోకం కలిగి ఉండేవి కావు!

... పాలకుర్తి రామమూర్తి

## కంకరలోనూ శంకరుడే

కథాసుధ

**ఒక** గ్రామంలోని గుడిలో ప్రతి శనివారం సాయంత్రం పూజలు చేసేవారు. వాటికి ఊళ్లో పిల్లలూ, పెద్దలూ అందరూ హాజరయ్యేవారు. ఓ రోజు గ్రామపెద్ద గుడికి వెళ్తుండగా అదే ఊరికి చెందిన గజ ఈతగాడు ఎదురయ్యాడు. గుడిలో జరిగే పూజకు రమ్మని ఈతగాడిని పిలిచాడు గ్రామపెద్ద. వెటకారంగా ఆ గజ ఈతగాడు 'మీ పిచ్చి కాకపోతే... నిజంగా దేవుడు ఉన్నాడా?' అని ప్రశ్నించాడు. 'నీకు దేవుణ్ని చూపిస్తాను. నాతో రా!' అని పొలాల దగ్గరికి ఆ ఈతగాడిని తీసుకెళ్లాడు గ్రామపెద్ద. అక్కడ ఓ పెద్ద బావి ఉంది. అందులో నీళ్లు నిండుగా ఉన్నాయి. దాన్ని చూపిస్తూ గ్రామపెద్ద 'ఇందులో దూకగలవా?' అని ప్రశ్నించాడు. ఈతగాడు పెద్దగా నవ్వి 'పెద్ద పెద్ద చెరువులు, నదులు ఈదినవాడిని. వాటి లోతులకు వెళ్లి ఎన్నో సాహసాలు చేసినవాడిని.. నాకు ఈ బావి ఓ లెక్కా' అన్నాడు. 'సరే నాతో రా!' అని గ్రామపెద్ద ఆ ఈతగాడిని మరో బావి దగ్గరికి తీసుకెళ్లాడు. ఆ బావి పూర్తిగా ఎండి ఉంది. అందులో రాళ్లు, రప్పలు, కంప చెట్లు ఉన్నాయి. దానిని చూపుతూ 'దీనిలో దూకగలవా?' అని అడిగాడు. ఈతగాడు అసహనంగా 'ఇందులో దూకితే నా కాళ్లూ చేతులూ విరుగుతాయి. తెలిసి తెలిసీ ఎవరూ నీళ్లు లేని బావిలో దూకరు' అని గట్టిగా బదులిచ్చాడు. వెంటనే గ్రామపెద్ద 'దేవుడు ఉన్నాడో లేడో కానీ... ఉన్నాడని నమ్మితే మనకు భరోసా లభిస్తుంది. మన కష్టనష్టాల్ని చెప్పుకోవడానికి ఒక ఆధారం లభిస్తుంది. ఏదో అదృశ్య శక్తి మనకు మంచి చేస్తుందనే ఆశ చిగురిస్తుంది. జీవితంపై నమ్మకం, భవిష్యత్తుపై ఆశావాద దృక్పథం అలవడుతాయి. బావిలో నీళ్లుంటేనే కదా మనం ధైర్యంగా దూకుతాం. లేదంటే దూకే సాహసం చేయం కదా! అలాగే ఎన్ని కష్టనష్టాలొచ్చినా, 'దేవుడనేవాడు ఒకడు ఉన్నాడు, మనల్ని కాపాడుతాడు' అనే నమ్మకం మన ఒంటరితనాన్ని పారదోలుతుంది. కష్టాలకు తట్టుకుని నిలబడే శక్తినిస్తుంది. అందుకే దైవ ప్రార్థన చేసేది' అని బదులిచ్చి ముందుకు నడిచాడు. 'నమ్మితే కంకరలోనూ శంకరుడు కనిపిస్తాడు' అని తెలుసుకున్న గజ ఈతగాడు, గ్రామపెద్దను అనుసరించాడు.



... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

## సోదరా.. నేనున్నా!

ఇస్లాం బోధ



**ఇద్దరు** తోడబుట్టిన సోదరులు ఉండేవారు. ఎవరి కాపురాలు వాళ్లవి. ఓ రోజు తమ్ముడు అతని అన్న ఇంటికి వచ్చి అవసరంగా డబ్బులు కావాలన్నాడు. అన్న మరో ఆలోచన లేకుండా తమ్ముడు అడిగిన మొత్తం ఇచ్చేశాడు. తమ్ముడు వెళ్లిపోగానే ఇంట్లోకి వచ్చి తీవ్ర దుఃఖంతో రోదించసాగాడు. అది గమనించిన అతని భార్య 'ఇప్పుడు ఏడ్చి ఏం లాభం, డబ్బులిచ్చే ముందు కనీసం నన్ను సంప్రదించనైనా లేదు' అని ఓదార్చే ప్రయత్నం చేసింది. 'నేను ఏడుస్తున్నది డబ్బు ఇచ్చినందుకు కాదు. నా తమ్ముడు నా దగ్గరికి వచ్చి చెప్పుకొనే వరకు తన కష్టాలను తెలుసుకోలేక పోయినందుకు' అని విలపించసాగాడు. దగ్గరి బంధువులు, ఇరుగుపొరుగు బాగోగులను ఓ కంట కనిపెడుతూ ఉండాలన్నది ప్రవక్త బోధనల సారాంశం. 'ఎవరైతే తన సోదరుడి కష్టాలు తీరుస్తాడో.. అతని కష్టాలను అల్లాహ్ తీరుస్తాడు. సోదరుడికి సాయం చేసినన్నాళ్లూ.. ఆ వ్యక్తికి దైవం కూడా సాయం చేస్తుంటాడు. సోదరులు పరస్పరం ఒకరి కష్టసుఖాల్లో పాలు పంచుకోవడమే కాదు, ఒకరిలోని లోపాలను, బలహీనతలను, దురలవాట్లను దూరం చేయాలి. ఒకరినొకరు సంస్కరించుకోవాలి' అని ప్రవక్త బోధ.

ఇద్దరు అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు వచ్చినప్పుడు ఒకరు ఒక మెట్టు దిగి సంబంధాలను మెరుగుపర్చడం పిరికితనం కాదు, అది మానవత్వానికి నిదర్శనం. '(మూసా) మేము నీ సోదరుని ద్వారా నీ చేతులకు బలాన్ని సమకూరుస్తాం. మేము మీ ఉభయులకు ఒక విశేషశక్తిని ప్రసాదిస్తాం' అని అన్నదమ్ముల ఐక్యత గురించి ఖురాన్ వివరిస్తుంది. ముహమ్మద్ ప్రవక్త ప్రాణమిత్రుల్లో హజ్రత్ అలీ (ర) ఒకరు. అలీ (రజి) కుమారుడైన ముహమ్మద్ బిన్ హనఫీయా దగ్గరికి ఒక వ్యక్తి వచ్చి 'మీ నాన్న నీ తమ్ముళ్లిద్దరినీ ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. కానీ, నీ పట్ల మాత్రం వివక్ష చూపుతున్నాడు' అని అన్నదమ్ముల మధ్య గొడవపెట్టే ప్రయత్నం చేశాడు. అతని మాటలను తిప్పికొడుతూ 'నా సోదరులు హసన్, హుసైన్ (ర)- మా నాన్నకు రెండు చెంపల వంటివారు, నేను ఆయన చెయ్యి. తన రెండు చెంపలకు ఏ హానీ కలగకూడదని తన రెండు చేతులను అడ్డుగా పెట్టుకున్నారు. అంటే మేమంతా ఒకే దేహంలోని భాగాలం' అన్న సమాధానంతో చెంప చెళ్లుమనిపించారు.

ప్రవక్త మూసా (అలైహిస్సలామ్) తన పెద్దన్న శ్రేయస్సు కోసం అల్లాహ్‌ను ప్రార్థించాడు. 'ప్రభూ! నన్నూ, నా సోదరుణ్ని క్షమించు. మా ఇద్దరికీ నీ కారుణ్య ఛాయలో చోటివ్వు నా సోదరుడి ద్వారా నా చేతులను పటిష్ఠం చెయ్యి. అతనిని నా కార్యంలో నాకు సహాయపడేలా చెయ్యి. మేము నీ పరిశుద్ధతను అత్యధికంగా ప్రకటించేటందుకు, నిన్ను అమితంగా స్మరించేటందుకు అవకాశం కల్పించు' అని వేడుకున్న ప్రవక్త మూసా (అలై) మాటలు అల్లాహ్‌కు ఎంతగానో నచ్చాయి. అందుకే వాటిని దివ్య ఖురాన్‌లో (20:25)లో పొందుపరిచారు. అన్నదమ్ముల ఐక్యత ఎంత విలువైనదో ఈ సందర్భం తెలియజేస్తుంది.

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076